7

సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 28 । మే । 2023



చీనీ టన్ను రూ.36 వేలు
అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.36 వేలు పలికాయి. మార్కెట్‌కు 570 టన్నుల కాయలు అమ్మకానికి వచ్చాయి.



విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు
వివిధ పథకాలతో నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్ బాటలు వేశారని ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. 8లో

గరిష్ఠం/కనిష్ఠం
40.8°/22.7°
జిల్లాలో శనివారం పగలు, రాత్రి ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఉక్కపోత, వడగాల్పుల తీవ్రత అధికంగానే ఉంది. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై ఒకట్రెండు చోట్ల తేలికపాటి వర్షం కురిసింది.

న్యూస్‌రీల్

కదిరి ఏఆర్‌ఎస్‌కు జాతీయస్థాయి అవార్డు



ఉత్తమ అవార్డు అందుకుంటున్న శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్ తదితరులు

కదిరి: కదిరి వ్యవసాయ పరిశోధనా కేంద్రం (ఏఆర్‌ఎస్)కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించింది. 2022 సంవత్సరంలో అధిక మొత్తంలో కదిరి వేరుశనగ రకాలు ఉత్పత్తి చేసి దేశంలోని వివిధ రాష్ట్రాలకు అందించినందుకు గాను జాతీయ స్థాయిలో 'ఉత్తమ విత్తన ఉత్పత్తి కేంద్రం' అవార్డు దక్కింది. ఈ నెల 24 నుంచి నాలుగు రోజుల పాటు గుజరాత్ రాష్ట్రంలోని జునాఘడ్‌లోని జాతీయ వేరుశనగ పరిశోధనా కేంద్రంలో దేశ వ్యాప్తంగా ఉన్న వేరుశనగ శాస్త్రవేత్తలతో సమావేశం నిర్వహించారు. ఇందులో కదిరి వ్యవసాయ పరిశోధనా స్థానానికి జాతీయ స్థాయిలో మొదటి బహుమతి లభించింది. ఈ అవార్డును భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డా.టీఆర్ శర్మ, జాతీయ డైరెక్టర్ డా.బీరల చేతుల మీదుగా కదిరి వేరుశనగ పరిశోధనా కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త డా.సంపత్‌కుమార్‌తో పాటు తోటి శాస్త్రవేత్తలు డా.వేమన, డా.రాజేష్, డా.వెంకటరమణలు అందుకున్నారు. మొదటి బహుమతి రావడంపై వారు 'సాక్షి'తో సంతోషం వెలిబుచ్చారు.

ప్రశాంతంగా పోలీసుల బదిలీల ప్రక్రియ



ఏఎస్‌ఐకి బదిలీ పత్రాన్ని అందిస్తున్న ఎస్పీ మాధవరెడ్డి

కొత్తచెరువు: జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లలో పనిచేస్తున్న ఏఎస్‌ఐలు, హెడ్ కానిస్టేబుళ్ల బదిలీల ప్రక్రియను రెండోరోజైన శనివారం కూడా ఎస్పీ ఎస్‌వీ మాధవరెడ్డి కొనసాగించారు. వివిధ స్టేషన్లలో ఐదేళ్లుగా పనిచేస్తున్న ఏడుగురు ఏఎస్‌ఐలు, 24 మంది హెడ్ కానిస్టేబుళ్లకు జిల్లా పోలీస్ కార్యాలయంలో బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఎలాంటి సిఫార్సులకు తావు లేకుండా నిష్పక్షపాతంగా బదిలీలు చేసినట్లు ఎస్పీ తెలియజేశారు.

జీఎస్టీ వసూళ్లు అదుర్స్

- ఉమ్మడి అనంతపురం జిల్లాలో భారీగా రాబడులు
- ఒక్క ఆర్థిక సంవత్సరంలోనే సెంట్రల్, స్టేట్ ట్యాక్స్‌ల రూపేణా రూ.6.754 కోట్ల వసూలు
- పరిశ్రమల నుంచి భారీగా వస్తున్నట్లు అధికారుల వెల్లడి
- గతంతో పోలిస్తే 15 శాతానికి పైగా పెరిగిన వసూళ్లు
- పరిశ్రమలు పెరుగుతున్న కొద్దీ పన్ను రాబడుల్లోనూ పురోగతి





జీఎస్టీ భవన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: గడిచిన ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి అనంతపురం జిల్లాలో పన్ను రాబడులు బాగా పెరిగాయి. జీఎస్టీ వసూళ్లలో మంచి ఫలితాలు వచ్చాయి. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల నుంచి 2022–23 ఆర్థిక సంవత్సరంలో సెంట్రల్, స్టేట్ ట్యాక్స్‌ల రూపేణా రూ.6,754 కోట్ల జీఎస్టీ వసూలైంది. 2021–22 ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 15 శాతానికి పైగా అధికంగా వసూలైనట్లు అధికార వర్గాలు తెలిపాయి. రెండు జిల్లాల్లోనూ ఏడు జీఎస్టీ సర్కిళ్లు ఉన్నాయి. వీటి నుంచి ఈ సొమ్ము వసూలైంది. అలాగే మునుపటి ఆర్థిక సంవత్సరం (2021–22)లో జీఎస్టీ రూపేణా సుమారు రూ.5,740 కోట్ల ఆదాయం చేకూరింది.

ఎంఎస్‌ఎంఈలు పెరుగుతున్న కొద్దీ..

ఉమ్మడి జిల్లాలో గడిచిన నాలుగేళ్లుగా సూక్ష్మ, చిన్న, మధ్యతరగతి పరిశ్రమల ఏర్పాటు గణనీయంగా పెరుగుతోంది. దీనివల్ల పన్నుల రూపేణా వచ్చే రాబడుల మొత్తం కూడా పెరుగుతున్నట్టు తేలింది. ముఖ్యంగా సిమెంటు , కార్లు , స్టీల్ , గార్మెంట్ కంపెనీల నుంచి 40 శాతం పైన వసూళ్లు ఉన్నాయి. వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల్లో మరిన్ని పరిశ్రమలు ఏర్పాటు కానున్నాయి. కొత్త పారిశ్రామిక పాలసీ (2023–27) తీసుకురావడం వల్ల చాలామంది సూక్ష్మ, చిన్న స్థాయి పరిశ్రమలు నెలకొల్పడానికి ముందుకు వస్తున్నారు. దీనివల్ల రానున్న రోజుల్లో పన్నుల రూపేణా వచ్చే రాబడులు మరింతగా పెరిగే అవకాశం ఉన్నట్టు అధికారులు చెబుతున్నారు.

జీరో బిజినెస్‌ను అరికడితే మరింత వృద్ధి

అనంతపురం మునిసిపల్ కార్పొరేషన్‌తో పాటు కొన్ని పెద్ద మునిసిపాలిటీల్లోనూ జీరో బిజినెస్ ఎక్కువగా జరుగుతోంది. దీని కారణంగా ప్రభుత్వానికి తగినంత ఆదాయం రావడం లేదు. కొన్ని స్టీల్, ఎలక్ట్రికల్ షాపులు, హోటళ్లు..ఇతరత్రా దుకాణాల నిర్వాహకులు కనీస పన్నులు కట్టకుండా ఎగ్గొడుతున్నారు. వినియోగదారులకు ఎలాంటి బిల్లులూ ఇవ్వడం లేదు. ఇలాంటి వాటికి అడ్డుకట్ట వేసి పూర్తి స్థాయిలో పన్ను వసూళ్లు జరిగితే నెలకు రూ.30 కోట్ల నుంచి రూ.40 కోట్లు అదనంగా వస్తుందని అంచనా వేస్తున్నారు. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాల నుంచి రాత్రికి రాత్రి సరుకు రావడం , ఇక్కడ అన్‌లోడ్ కావడం, షాపుల్లో బిల్లులు లేకుండా అమ్మడం.. తరచూ జరుగుతున్న తంతు ఇది. దీనిపై అధికారులు దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

2022-23 ఆర్థిక సంవత్సరంలో ఉమ్మడి అనంతలో నెలవారీగా జీఎస్టీ వసూళ్లు

నెల	వసూలైన మొత్తం (కోట్లలో)
2022 ఏప్రిల్	712.17
2022 మే	602.48
2022 జూన్	446.32
2022 జూలై	622.07
2022 ఆగస్ట్	497.71
2022 సెప్టెంబర్	490.39
2022 అక్టోబర్	598.70
2022 నవంబర్	459.61
2022 డిసెంబర్	527.96
2023 జనవరి	487.90
2023 ఫిబ్రవరి	712.93
2023 మార్చి	596.46

వసూళ్లు భేష్

ఉమ్మడి అనంతపురం జిల్లాలో పరిశ్రమల నుంచి పన్ను వసూళ్లు బాగుంటున్నాయి. గతంతో పోలిస్తే 15 శాతం అధికంగా పన్ను వసూలైంది. వచ్చే ఏడాది మరింత పెరిగే అవకాశం ఉంది. సిమెంటు, స్టీల్, కార్ల ఇండస్ట్రీ నుంచి ఎగుమతులు ఎక్కువగా ఉంటున్నాయి. వీటి వల్ల మంచి రాబడులు వస్తున్నాయి.
– నీరజ, జాయింట్ కమిషనర్, జీఎస్టీ

టీచర్ల బదిలీలకు 7,856 దరఖాస్తులు

రాప్తాడురూరల్: ఉపాధ్యాయ బదిలీలకు 7,856 మంది దరఖాస్తు చేసుకున్నారు. శుక్రవారంతో గడువు ముగిసింది. అయినా శనివారం మధ్యాహ్నం వరకు వెబ్‌సైట్ అందుబాటులో ఉండడంతో తప్పనిసరి బదిలీ కావాల్సిన పలువురు దరఖాస్తు చేసుకున్నారు. ప్రిఫరెన్షియల్, స్పౌజ్ కేటగిరీల కింద వచ్చిన దరఖాస్తులను స్థానిక సైన్స్ సెంటర్‌లో శనివారం అర్ధరాత్రి వరకూ జరిగింది. షెడ్యూల్ ప్రకారం ఆదివారం ప్రొవిజినల్ సీనియార్టీ జాబితా విడుదల చేయనున్నారు. ఈనెల 30న అభ్యంతరాలు స్వీకరణ, జూన్ 2న తుది జాబితా వెల్లడించనున్నారు.

శతాధిక వృద్ధురాలు కన్నుమూత



వడ్డి తిప్పక్క (ఫైల్)

రామగిరి: మండలంలోని ఆర్.కొత్తపల్లిలో శతాధిక వృద్ధురాలు వడ్డితిప్పక్క (110) శనివారం మృతి చెందినట్లు బంధువులు, గ్రామస్తులు తెలిపారు. వడ్డితిప్పక్క గ్రామంలో అందరికంటే వయస్సులో పెద్దవారని, 110 ఏళ్లు వచ్చినప్పటికీ అందరితో కలివిడిగా మాట్లాడుతుండేవారన్నారు. కొద్దిరోజులుగా అనారోగ్యంతో మంచం పట్టారని, శనివారం తెల్లవారుజామున కన్నుమూసినట్లు చెప్పారు. తిప్పక్కకు ముగ్గురు కుమారులుకాగా.. వారికి కూడా ఒక్కొక్కరికి ముగ్గురు సంతానం ఉన్నారన్నారు.

నేడు సివిల్స్ ప్రిలిమినరీ పరీక్ష

అనంతపురం అర్బన్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యూపీఎస్సీ) ఆధ్వర్యంలో సివిల్ సర్వీసెస్ ప్రిలిమినరీ పరీక్ష–2023 ఆదివారం జరగనుంది. ఎనిమిది కేంద్రాల్లో పరీక్ష నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. పరీక్ష రెండు సెషన్లుగా నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి 11.30 గంటల వరకు పేపర్–1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్–2 ఉంటుంది. అనంతపురం కేంద్రంగా జరగనున్న ప్రిలిమినరీ పరీక్షకు రాయలసీమ పరిధిలోని అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్సార్, అన్నమయ్య, కర్నూలు, నంద్యాల జిల్లాల నుంచి 3,213 మంది అభ్యర్థులు హాజరుకానున్నారు. పరీక్ష కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు కల్పించారు. ప్రతి కేంద్రం వద్ద పటిష్టమైన పోలీసు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

గంట ముందే కేంద్రానికి చేరుకోవాలి..

అభ్యర్థులు పరీక్ష సమయం కంటే ఒక గంట ముందు పరీక్ష కేంద్రానికి చేరుకోవాలని అధికారులు స్పష్టం చేశారు. పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్లు, ఇతర ఏ విధమైన ఎలక్ట్రానిక్ వస్తువులకు అనుమతి ఉండదు.అభ్యర్థులు హాల్‌టికెట్‌తో పాటు ఆధార్, పాన్, డ్రైవింగ్ లైసెన్స్ ఇలా ఏదేని గుర్తింపు కార్డు తప్పనిసరిగా వెంట తీసుకురావాలి. అభ్యర్థుల సౌలభ్యం కోసం కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ పని చేస్తుంది. ఏదైనా సమాచారం లేదా ఫిర్యాదు కోసం 8500292992 నంబర్‌కు ఫోన్ చేయొచ్చు.

ఎనిమిది మంది ఇన్‌స్పెక్టింగ్ అధికారులు..

పరీక్ష సజావుగా జరిగేందుకు ఎనిమిది మంది జిల్లా అధికారులను ఇన్‌స్పెక్టింగ్ అధికారులుగా నియమించారు. ఇద్దరు అధికారులను రిజర్వులో ఉంచారు. ఇక పరీక్ష కేంద్రంలో అదే కళాశాల ప్రిన్సిపాల్ సూపర్‌వైజర్‌గా వ్యవహరిస్తారు.

ప్రకృతి వ్యవసాయం చేస్తున్న రైతులకు ప్రోత్సాహం

పుట్టపర్తి అర్బన్: క్షేత్రస్థాయిలో ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులను గుర్తించి ప్రోత్సాహకాలు అందించాలని కలెక్టర్ అరుణ్‌బాబు సంబంధిత అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో ఎస్సీ రైతుల ప్రకృతి వ్యవసాయంపై సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 1055 మంది ఎస్సీ రైతులు ప్రకృతి వ్యవసాయం చేస్తున్నట్లు రైతు సాధికారిక సంస్థ నుంచి ఎస్సీ కార్పొరేషన్ ఎండీకి జాబితాను అందజేసినట్లు చెప్పారు. ఈ నేపథ్యంలో క్షేత్ర స్థాయిలో పర్యటించి ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారా? లేదా? అనేది పరిశీలించాలన్నారు. ప్రకృతి వ్యవసాయం చేస్తున్న ఎస్సీ రైతులకు ఒక్కొక్కరికి రూ.10 వేలు చొప్పున ప్రభుత్వం రూ.1.05 కోట్లు మంజూరు చేసిందన్నారు. ప్రభుత్వం మంజూరు చేసిన ఆర్థిక సహాయాన్ని నిజమైన రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీ ప్రభాకర్ రావు, జిల్లా వ్యవసాయాధికారి సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ అరుణ్‌బాబు

జగనన్న లే అవుట్ పరిశీలన

కొత్తచెరువు: కొత్తచెరువులోని ధర్మవరం రోడ్డులో ఉన్న జగనన్న హౌసింగ్ లే ఔట్‌ను కలెక్టర్ పి.అరుణ్‌బాబు శనివారం తనిఖీ చేశారు. జగనన్న కాలనీలో నిర్మాణంలో ఉన్న ఇళ్లను పరిశీలించారు. ఈ లే ఔట్‌లో 179 ఇళ్లు మంజూరు కాగా, 105 బేస్మెంట్ స్థాయిలో, 8 ఆర్‌ఎల్ స్థాయిలో, 7 ఆర్‌సీ స్థాయిలో మరో 22 ఇళ్లు పూర్తయినట్లు అధికారులు కలెక్టర్‌కు వివరించారు. లబ్ధిదారులకు ఏ ఇబ్బంది లేకుండా వారికి అన్ని విధాలా సహకరించాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

సీఎం జోలికొస్తే ఎవరినీ వదిలిపెట్టం



అంబేద్కర్ సర్కిల్‌లో నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు

హిందూపురం టౌన్: 'టీడీపీ, జనసేన నాయకులు మా ఓర్పును పరీక్షించొద్దు.. సీఎం ఒక్క సైగ చేస్తే తామేంటో చూపిస్తాం'. అని వైఎస్సార్‌సీపీ మాజీ సమన్వయకర్త కొండూరు వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఇంద్రజ అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో ఉన్న ఫ్లెక్సీని టీడీపీ, జనసేన నాయకులు చించడాన్ని ఖండిస్తూ శనివారం ఎమ్మెల్సీ మహమ్మద్ ఇక్బాల్ ఆదేశాలతో వైఎస్సార్‌సీపీ నాయకులు స్థానిక ఎమ్మెల్సీ కార్యాలయం నుంచి భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ సర్కిల్‌లో రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అంబేద్కర్ విగ్రహంతో పాటు సీఎం జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుత రాష్ట్ర పరిస్థితులకు అద్దం పట్టేలా ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను టీడీపీ, జనసేన నాయకులు చించడం వారి అరాచక, నీచ రాజకీయాలకు నిదర్శనమన్నారు. ప్రజల పక్షాన నిలిచిన సీఎం వైఎస్ జగన్‌ను చూసి ఓర్వలేక, కడుపు మంటతో టీడీపీ, జనసేన నాయకులు ఫ్లెక్సీలను చించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. హిందూపురంలో ఎప్పుడూ ఇలాంటి రాజకీయాలు లేవన్నారు. టీడీపీ హయాంలో తమపై ఎన్నో కేసులు పెట్టించారని, తాము ఇప్పుడు అధికారంలో ఉన్నా సహనంతో, ఓర్పుతో ఉంటూ అందరినీ సమానంగా చూస్తున్నామన్నారు. దీన్ని ఎవరూ అలుసుగా తీసుకోవద్దని, సీఎం జగనన్న జోలికొస్తే ఎవరినీ వదిలిపెట్టబోమని హెచ్చరించారు. దమ్ముంటే ఎన్నికల్లో తేల్చుకుందాం రండని టీడీపీ, జనసేన నాయకులకు సవాల్ విసిరారు. మీరు పొత్తులతో వచ్చినా తమ నాయకుడు సీఎం వైఎస్ జగన్ సింహంలా సింగల్‌గా వస్తారన్నారు. 2024తో పాటు మరో 20 ఏళ్ల పాటు జగనన్నే సీఎంగా కొనసాగుతారని ధీమా వ్యక్తం చేశారు. సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీలను చించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జబీవుల్లా, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, వైఎస్సార్‌సీపీ లేపాక్షి మండల కన్వీనర్ నారాయణస్వామి, జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు లోకేష్, కౌన్సిలర్లు అయూబ్, రహమత్ బీ, ముస్తాక్, రోషన్ అలీ, మల్లికార్జున గౌడ్, మల్లికార్జున, చిన్నమ్మ, పురుషోత్తం, కోఆప్షన్ మెంబర్ రహమత్, తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ, జనసేన విష సంస్కృతికి తెరలేపాయి

- సీఎం ఫ్లెక్సీ చించివేతపై మండిపడ్డ ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్



మాట్లాడుతున్న రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్

హిందూపురం టౌన్: 'ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఫొటో ఉన్న ఫ్లెక్సీని చించి టీడీపీ, జనసేన నాయకులు విష సంస్కృతికి తెరలేపారు.. చౌకబారు రాజకీయాలు చేస్తున్నారు.. ఇప్పటికైనా వాటిని మానుకోవాలి' అని ఆగ్రోస్ చైర్మన్ నవీన్ నిశ్చల్ అన్నారు. స్థానిక ఆగ్రోస్ చైర్మన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్ ఫ్లెక్సీని చించడం ద్వారా ప్రశాంతంగా ఉన్న హిందూపురంలో టీడీపీ, జనసేన నాయకులు అలజడి సృష్టించారని మండిపడ్డారు. సీఎం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలతో ప్రజల పక్షపాతిగా ఉన్నారని సూచిస్తూ.. టీడీపీ, జనసేన పెత్తందారుల వైపు ఉన్నట్లు సూచిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలో తప్పేముందో చెప్పాలని ప్రశ్నించారు. ప్రజలకు సీఎం మంచి చేస్తుండటంతో జీర్ణించుకోలేక సీఎం ఉన్న ఫ్లెక్సీని చించడం మంచి సాంప్రదాయం కాదన్నారు. హిందూపురంలో ఇప్పటి దాకా ఒక పార్టీ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలను మరోపార్టీ చించివేసిన ఘటనలు ఎప్పుడూ చోటుచేసుకోలేదన్నారు. ఫ్లెక్సీపై అభ్యంతరాలు ఉంటే సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయాలని, అందుకు తగ్గట్టు చట్టాలు ఉన్నాయన్నారు. అలా కాదని ఫ్లెక్సీని చింపడం సరికాదని, ఇకపై ఇలాంటి ఘటనలు జరిగితే సహించబోమని హెచ్చరించారు. ఫ్లెక్సీ చింపిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో కౌన్సిలర్ ఇర్షాద్, సర్పంచ్ నాగేంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు డాక్టర్ బాషా, వేణుగోపాల్‌రెడ్డి, నారాయణస్వామి, చంటి, వరుణ్, ప్రమోద్, నటరాజ్ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

టీడీపీ యువనేత ఆత్మహత్య


గోపి (ఫైల్)

సోమందేపల్లి: తెలుగు యువత పెనుకొండ నియోజకవర్గ అధ్యక్షుడు, సోమందేపల్లి నివాసి వడ్డే గోపి (36) ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానిక వాల్మీకి సర్కిల్‌లో కొంత కాలంగా భార్య దివ్యతో కలిసి టెక్స్‌టైల్స్ దుకాణాన్ని నిర్వహిస్తున్న ఆయన శనివారం ఉదయం తన ఇంట్లో పైకప్పుకు ఉరి వేసుకున్నాడు. విషయాన్ని గమనించిన కుటుంబసభ్యులు వెంటనే కాపాడి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడు. అనారోగ్య సమస్యలతో పాటు ఆర్థిక ఇబ్బందులే ఇందుకు కారణంగా తెలుస్తోంది. మృతుడికి ఇద్దరు పిల్లలున్నారు. బాధిత కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఏఎస్‌ఐ మురళి తెలిపారు.

ప్రాణాలు కాపాడిన పోలీసులు

కొత్తచెరువు: కుటుంబ కలహాల నేపథ్యంలో ఆత్మహత్య చేసుకోబోతున్న వ్యక్తి ప్రాణాలను పోలీసులు సకాలంలో కాపాడారు. వివరాలు.. కొత్తచెరువు గ్రామానికి చెందిన రామాంజినేయులు కుటుంబ కలహాల నేపథ్యంలో జీవితంపై విరక్తి చెంది శనివారం ఉదయం పెనుకొండ మార్గంలోని రైలు పట్టాలపై చేరుకుని ఆత్మహత్య చేసుకునేందుకు సిద్ధమయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే అక్కడకు చేరుకుని పట్టాల మధ్యలో కూర్చొని రైలు రాక కోసం ఎదురుచూస్తున్న రామాంజినేయులుకు సర్దిచెప్పి పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారు. అనంతరం కుటుంబసభ్యులకు కౌన్సిలింగ్ నిర్వహించి, రామాంజినేయులను అప్పగించారు. వ్యక్తి ప్రాణాలు కాపాడిన కొత్తచెరువు పోలీసులను సీఐ జయనాయక్, ఎస్‌ఐ లింగన్న అభినందించారు.

చేనేతల సంక్షేమమే ధ్యేయం

- నైపుణ్యాభివృద్ధి కోసం రూ.20 కోట్లతో క్లస్టర్ల ఏర్పాటు
- 90శాతం రాయితీతో చేనేత మగ్గం, పరికరాల పంపిణీ
- సంక్షోభ నివారణకు ప్రభుత్వ పథకాలు సద్వినియోగం చేసుకోండి
- కార్మికులకు ఉపాధి కల్పించేందుకు ప్రత్యేక చర్యలు
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి



ధర్మవరం: చేనేతల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పని చేస్తోందని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి తెలిపారు. శనివారం స్థానిక తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. చేనేత కార్మికులకు వృత్తి నైపుణ్యాభివృద్ధి కోసం జాతీయ చేనేత అభివృద్ధి పథకం కింద రూ. 20కోట్ల వ్యయంతో 10 క్లస్టర్లు ఏర్పాటు చేసినట్లు గుర్తు చేశారు. వీటి ద్వారా 200 మంది చేనేత కార్మికులకు నైపుణ్య శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. శిక్షణ పూర్తి చేసుకున్నవారికి 90శాతం రాయితీతో మగ్గం పరికరాలు, లైటింగ్ యూనిట్లు, వర్క్‌షెడ్ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇందు కోసం జూన్ 10వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మాస్టర్ వీవర్‌లకు ముడి పట్టు కొనుగోలుపై జాతీయ చేనేత అభివృద్ధి కార్పొరేషన్ కింద 15 శాతం రాయితీ ఇవ్వడం జరుగుతోందన్నారు. పేద, మధ్య తరగతి చేనేత కార్మికులకు చేనేత మగ్గాలు అభివృద్ధి చేసుకునేందుకు ముద్ర రుణాలను అందజేస్తున్నట్లు వివరించారు. ఇందుకు సంబంధించి 1,710 యూనిట్లు మంజూరయ్యాయన్నారు. చేనేతలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఉపాధి కల్పనకు ప్రత్యేక చర్యలు..

గుడ్‌మార్నింగ్ ధర్మవరం కార్యక్రమంలో భాగంగా పట్టణంలో పర్యటిస్తున్నప్పుడు పలువురు చేనేత కార్మికులు ఉపాధి లేక ఇబ్బంది పడుతున్న విషయాన్ని తన దృష్టికి తీసుకు వచ్చారని వీరికి మాస్టర్ వీవర్‌లతో మాట్లాడి ఉపాధి కల్పించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఉపాధి కావాలనుకునే చేనేతలు 1 నుంచి 20 సచివాలయాల పరిధిలో ఏడీఓ శీనా నాయక్ (94925 53664), 21 నుంచి 29 సచివాలయాల పరిధిలో డీఓ రమణారెడ్డి (83319 20922), 30 నుంచి 39 సచివాలయాల పరిధిలో ఏడీఓ విజయానంద్ (96181 76529)ను సంప్రదించాలన్నారు.

దుష్ప్రచారాలను నమ్మొద్దు..

ధర్మవరంలో పవర్‌లూమ్స్ ఏర్పాటు చేసుకోవడం వల్ల చేనేత దెబ్బతింటోందని కొందరు చేస్తున్న దుష్ప్రచారాలను నమ్మబోరాదని చేనతలకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం ఎన్నడూ పవర్‌లూమ్స్‌కు మద్దతు ఇవ్వదన్నారు. చేనేతలకు నేతన్న నేస్తం పథకం పేరుతో ప్రభుత్వం ఒకేసారి రూ.24 వేలు ముడిపట్టు రాయితీని అందజేస్తోందని గుర్తు చేశారు. వచ్చే నెలలో నేతన్న నేస్తం పథకం ద్వారా ప్రభుత్వ సాయం అందనుందన్నారు. టీడీపీ హయాంలో ఆత్మహత్య చేసుకున్న చేనేత కార్మికులకు ఒక్కో కుటుంబానికి రూ.5లక్షలు సాయం అందించిన ఘనత తమకే దక్కుతుందన్నారు. ప్రతిపక్షాలు కేవలం తప్పుడు ప్రచారాలతో కార్మికులను మభ్య పెట్టాలని చూస్తున్నాయని, వీటిని నమ్మబోరాదని కోరారు.

సర్వజనాస్పత్రిలో కూలీ మృతి

- సకాలంలో క్రిటికల్ కేర్‌కు పంపకుండా వైద్యుల నిర్లక్ష్యం
- ఘటనపై విచారణ చేపడతామన్న డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ


ఎమర్జెన్సీ వార్డులో మృతి చెందిన నాగరాజు

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డులో ఓ కూలీ మృతి చెందాడు. సకాలంలో క్రిటికల్ కేర్ యూనిట్‌కు తరలించకుండా వైద్యులు ఉదాసీనంగా వ్యవహరించడమే ఇందుకు కారణంగా ఆరోపణలు వెల్లువెత్తాయి. మృతుడి భార్య శ్రావణి, తల్లి నరసమ్మ తెలిపిన మేరకు... శుక్రవారం అర్ధరాత్రి దాటిన తర్వాత తీవ్ర ఆయాసంతో బాధపడుతున్న శ్రీసత్యసాయి జిల్లా చెన్నేకొత్తపల్లి (సీకేపల్లి) మండలం ముష్టికోవెల గ్రామానికి చెందిన వై.నాగరాజు(35)ను ఇంటి పక్కనే ఉన్న నరేష్ సాయంతో ఆటోలో సీకే పల్లిలోని సీహెచ్‌సీకి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో అక్కడి వైద్యుల సూచన మేరకు ఆగమేఘాలపై అనంతపురంలోని సర్వజనాస్పత్రికి తరలించారు. శనివారం తెల్లవారుజాము 5 గంటలకు ఎమర్జెన్సీ వార్డుకు చేరుకున్నారు. ఊపిరి తీసుకునేందుకు ఇబ్బంది పడుతున్న రోగి శాచురేషన్, పల్స్ తక్కువగా ఉంటే నిబంధనల మేరకు వెంటనే అక్యూట్ మెడికల్ కేర్ యూనిట్(ఏఎంసీ)కి తరలించి వైద్య సేవలందించాలి. అయితే నాగరాజు విషయంలో అలా జరగలేదనే ఆరోపణలున్నాయి. గంటల తరపడి ఎమర్జెన్సీ వార్డులోనే ఉంచేయడంతో పరిస్థితి విషమించి ఆయన మృతి చెందాడు. కాగా, కేసు షీట్‌లో ఉదయం 6.24 గంటలకు అడ్మిట్ కాగా, 9.45 గంటలకు మృతి చెందినట్లు నమోదైంది. కాగా, శాచురేషన్ తక్కువ, సమస్యాత్మకంగా ఉన్న కేసును ఏఎంసీకి ఎందుకు షిఫ్ట్ చేయలేదని క్యాజువాలిటీ మెడికల్ ఆఫీసర్ రామాంజినేయులను అసిస్టెంట్ ఆర్‌ఎంఓ డాక్టర్ సునీత ప్రశ్నించినట్లు తెలిసింది. దీనిపై ఆయన సమాధానమివ్వకపోవడంతో కేసు వివాదస్పదమైతే మీరే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించినట్లు సమాచారం. ఘటనపై విచారణ చేపట్టనున్నట్లు డిప్యూటీ ఆర్‌ఎంఓ డాక్టర్ పద్మజ పేర్కొన్నారు.

29 నుంచి స్కిల్ హబ్‌లో కొత్త కోర్సు ప్రారంభం

పెనుకొండ: రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ , సీడాప్ ఆధ్వర్యంలో ఈ నెల 29 నుంచి కస్టమర్ కేర్ ఎగ్జిక్యూటివ్ డొమెస్టిక్ నాన్ వాయిస్ నూతన కోర్సును పెనుకొండలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ప్రారంభించనున్నట్లు ప్రిన్సిపాల్ నీలం రమేష్‌రెడ్డి, జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి అబ్దుల్ ఖయ్యూం తెలిపారు. కళాశాలలో స్కిల్ హబ్ ఏర్పాటు చేశామని, ఇంటర్, డిగ్రీ ఉత్తీర్ణులై ఆసక్తి ఉన్న యువతీ యువకులు తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. వివరాలకు 9014264907, 7382792779 నంబర్లను సంప్రదించాలన్నారు.

'బెస్ట్'లో ఫుడ్ సేఫ్టీ అధికారుల తనిఖీలు

గోరంట్ల: మండలంలోని కమ్మలవాండ్లపల్లి సమీపంలో ఏర్పాటు చేసిన బెస్ట్ ఇన్నొవేషన్ యూనివర్సిటీ క్యాంటీన్‌లో శనివారం ఉదయం ఫుడ్ సేఫ్టీ ఇన్‌స్పెక్టర్ తస్లీమ్ తనిఖీలు చేపట్టారు. క్యాంటీన్‌లో నాణ్యత లేని ఆహారాన్ని అందిస్తున్నట్లుగా అందిన ఫిర్యాదుల నేపథ్యంలో ఈ తనిఖీలు చేపట్టినట్లు ఆమె వివరించారు. క్యాంటీన్ నిర్వాహకులతో పాటు విద్యార్థులతో మాట్లాడారు. ఆహార కల్తీతో విద్యార్థులు అనారోగ్యం బారిన పడితే కఠిన చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు. సిద్ధంగా ఉన్న ఆహార నమూనాలు సేకరించి ల్యాబ్‌కు పంపారు. కాగా, రెండు రోజుల క్రితం ఆహారంలో నాణ్యత లోపించడం పై ప్రశ్నించిన విద్యార్థులపై వర్సిటీ క్యాంటీన్ నిర్వాహకులు భౌతిక దాడికి పాల్పడినట్లుగా తెలిసింది.


క్యాంటీన్ స్టోర్ రూంను తనిఖీ చేస్తున్న ఫుడ్ సేఫ్టీ అధికారి తస్లీమ్

జగనన్నను మళ్లీ సీఎం చేయడమే లక్ష్యం

వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి


మాట్లాడుతున్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

పెనుకొండ: జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా కలసికట్టుగా పని చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలకు ఆ పార్టీ రీజనల్ కో–ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సూచించారు. పెనుకొండ ఎమ్మెల్యే శంకరనారాయణతో పాటు పార్టీకి చెందిన ముఖ్య నాయకులు, కొంత కాలంగా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్న నాయకులతో తిరుపతిలో శనివారం ఆయన సమావేశమై మాట్లాడారు. విభేదాలు పక్కనబెట్టి, పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, ఎంపీపీలు గీతారామ్మోహన్‌రెడ్డి, చంద్రశేఖర్, పార్టీ కన్వీనర్లు తుంగోడు నారాయణరెడ్డి, నాగలూరుబాబు, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ డైరెక్టర్ నారాయణరెడ్డి, పాటూరి శంకరరెడ్డి, వెంకటరత్నం, బూదిలి వేణుగోపాలరెడ్డి, ప్రభు, కొండలరాయుడు, రాజారెడ్డి, సుధాకరరెడ్డి, బ్రహ్మసముద్రం శ్రీనివాసులు, అశ్వత్థమ్మ, అక్కులప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు


మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ

పుట్టపర్తి టౌన్: వివిధ పథకాలతో నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాటలు వేశారని ఎమ్మెల్సీ మంగమ్మ, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ గిరిజమ్మ అన్నారు. పదో తరగతి, ఇంటర్‌లో ప్రతిభ చాటిన వాల్మీకి విద్యార్థులకు జిల్లా వాల్మీకి ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో పుట్టపర్తిలోని సాయి ఆరామంలో శనివారం అవార్డుల ప్రదానోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మంగమ్మ, గిరిజమ్మ, డీసీసీబీ చైర్‌పర్సన్ లిఖిత, పుడా చైర్‌పర్సన్ లక్ష్మీ నరసమ్మ, మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి హాజరయ్యారు. 250 మందికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ... పేదరికం కారణంగా బోయ, వాల్మీకి విద్యార్థులు సరైన చదువులు అభ్యసించలేకపోతున్నారన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా ప్రతిభావంతులైన విద్యార్థులకు అండగా నిలిచిన వాల్మీకి ఉద్యోగుల సంఘాల నాయకులను అభినందించారు. కార్యక్రమంలో డీసీసీబీ మాజీ చైర్మన్ పామిడి వీరా, వైఎస్సార్ సీపీ మండల మాజీ కన్వీనర్ గంగాద్రి, మున్సిపల్ మాజీ చైర్మన్ పీసీ గంగన్నతో పాటు వాల్మీకి ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మ సస్పెన్షన్

ఉత్తర్వులు జారీ చేసిన డీఎంఈ నరసింహం

అనంతపురం క్రైం: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని గైనిక్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై సస్పెన్షన్ వేటుపడింది. ఈ మేరకు శనివారం డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ నరసింహం ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల శ్రీ సత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల గ్రామానికి చెందిన కవిత (25) అబార్షన్ తర్వాత మృతిచెందిన విషయం విదితమే. దీనిపై 'సాక్షి'లో వరుసగా ' అనంతలో దారుణం, కదిలిన వైద్యురాలి అక్రమాల డొంక, అన్నీ అబద్ధాలే ' శీర్షికలతో కథనాలు ప్రచురితమయ్యాయి. బాలింత మృతి కేసుపై కలెక్టర్ గౌతమి సమగ్ర విచారణకు ఆదేశించారు. డీఎంహెచ్ఓ డాక్టర్ వీరబ్బాయి, పీసీపీఎన్‌డీటీ యాక్ట్ జిల్లా అధికారి డాక్టర్ యుగంధర్ లోతుగా విచారణ చేశారు.

ఇవీ అధికారుల విచారణ నివేదికలు ..

గతంలో అభిజ్ఞ ఆస్పత్రిలో డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై నమోదైన 14 ఫైళ్లు, మెడికల్ టర్మినేషన్ ఆఫ్ ప్రెగ్నెన్సీ (ఎంటీపీ) చట్టాన్ని అతిక్రమించి 99 అబార్షన్లు చేయడం, ఎలాంటి అనుమతులు తీసుకోకుండా శ్రీనివాస నగర్‌లో రూత్ ఆస్పత్రి నిర్వహణ చేపట్టినట్లు అధికారులు కలెక్టర్‌కు ఇచ్చిన నివేదికలో పేర్కొన్నారు. దీనిపై కలెక్టర్ గౌతమి ఈ నెల 22న సస్పెన్షన్‌కు సిఫార్సు చేశారు. ఆ సిఫార్సుతో పాటు డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై ఆరోగ్యశాఖ అధికారులు నమోదు చేసిన ఫైళ్ల ప్రతులను వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ శ్రీదేవికి పంపారు. సస్పెన్షన్ డీఎంఈ పరిధిలో ఉన్న క్రమంలో ప్రిన్సిపాల్.. కలెక్టర్ సిఫార్సుతో పాటు నివేదికలను డీఎంఈకి పంపారు. ఈ క్రమంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ లక్ష్మీకాంతమ్మపై సస్పెన్షన్ వేటుపడింది.

మద్యం తాగి గుడిలోకి వెళ్లొద్దన్నందుకే హత్య

ధర్మవరం అర్బన్: మద్యం సేవించి ఆలయంలోకి వెళ్లకూడదని హితవు చెప్పినందుకే పెయింటర్ దారుణంగా హతమయ్యాడని ధర్మవరం వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం, ట్రాఫిక్ సీఐ వహీద్ బాషా తెలిపారు. ఘటనకు సంబంధించిన వివరాలను శనివారం సాయంత్రం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు వెల్లడించారు. ధర్మవరంలోని సిద్దయ్యగుట్ట లక్ష్మీనరసింహస్వామి ఆలయం సమీపంలో శుక్రవారం రాత్రి పెయింటర్ సాకే నవీన్‌కుమార్‌ను బండరాళ్లతో మోది దారుణంగా హతమార్చిన విషయం తెలిసిందే. అనంతపురానికి చెందిన సాకే నవీన్‌కుమార్, అతని తమ్ముడు సాయినాథ్‌తోపాటు అన్నమయ్య జిల్లా కంబాలపల్లి మండలం కప్పలవారిపల్లికి చెందిన బేల్దారి నిమ్మల రెడ్డిశేఖర్ కొన్ని రోజులుగా ధర్మవరంలో బేల్దారి, పెయింటింగ్ పనులు చేస్తున్నారు. రోజూ సాయంత్రం పని ముగించుకుని ముగ్గురూ కలసి మద్యం సేవించేవారు. శుక్రవారం రాత్రి మద్యం సేవించిన అనంతరం సమీపంలో ఉన్న ఆలయంలోకి నిద్రించేందుకు వెళుతున్న రెడ్డిశేఖర్‌ను నవీన్‌కుమార్ అడ్డుకున్నాడు. మద్యం తాగి ఆలయంలోకి వెళ్లడం తప్పు అని, మరో చోటుకెళ్లి నిద్రిస్తామని పేర్కొన్నాడు. ఈ విషయంగా నవీన్‌కుమార్‌తో రెడ్డిశేఖర్ వాగ్వాదానికి దిగాడు. ఆ సమయంలో పక్కనే ఉన్న బండరాయితో నవీన్‌కుమార్ తలపై పలుమార్లు దాడి చేయడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు బృందాలుగా విడిపోయి నిందితుడి కోసం గాలిస్తుండగా గాంధీనగర్ సర్కిల్‌లో శనివారం ఉదయం తచ్చాడుతున్న రెడ్డిశేఖర్‌ను గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. విచారణ అనంతరం కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించారు.

డ్రగ్స్‌ఫ్రీ జిల్లాగా మార్చాలి

- కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి

పుట్టపర్తి అర్బన్: జిల్లాను డ్రగ్స్ ఫ్రీ గా మార్చాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు, ఎస్పీ మాధవరెడ్డి ఆదేశించారు. మత్తు పదార్థాలు, మాదక ద్రవ్యాల నివారణపై శనివారం సాయంత్రం పుట్టపర్తి కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. జిల్లాలోకి మత్తు పదార్థాలు రాకుండా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. డ్రగ్స్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై పాఠశాలలు, కళాశాలలు పునఃప్రారంభం కాగానే విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. సమావేశంలో అడిషనల్ ఎస్పీ రామకృష్ణప్రసాద్, సెబ్ సూపరింటెండెంట్ రవి కుమార్, ఇంటలిజెన్స్ డీఎస్పీ గోవింద్, ఆర్డీఓ భాగ్యరేఖ, సోషల్ వెల్ఫేర్ డీడీ శివరంగ ప్రసాద్, పట్టుపరిశ్రమ శాఖ జేడీ పద్మమ్మ, డీఎంహెచ్ఓ ఎస్వీ కృష్ణారెడ్డి, డీఈఓ మీనాక్షి, బీసీ వెల్ఫేర్ అధికారి నిర్మలాజ్యోతి, డీటీడబ్ల్యూఓ మోహన్‌రాం, జిల్లా ఫారెస్ట్ అధికారి రవీంద్రనాథరెడ్డి, కమర్షియల్ ట్యాక్స్ జాయింట్ కమిషనర్ కరీం బాషా, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ హనుమన్న, జిల్లా ఉద్యాన అధికారి చంద్రశేఖర్ పాల్గొన్నారు.

అభివృద్ధికి ప్రణాళికలు రూపొందించాలి

సంసద్ ఆదర్శ గ్రామ్ యోజన (ఎస్ఏజీవై) కింద ఎంపీ గోరంట్ల మాధవ్ దత్తత కు తీసుకున్న చిలమత్తూరు మండలంలోని వీరాపురం, రామగిరి మండలం నసనకోట, ధర్మవరం మండలం గొట్లూరు, గాండ్లపెంట మండలం కటారుపల్లి, అమరాపురం మండలం ముద్దనకుంట గ్రామాలను అభివృద్ధి చేయడానికి రూపొందించాలని సంబంధిత అధికారులను కలెక్టర్ అరుణ్‌బాబు ఆదేశించారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్ఏజీవైపై అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ నెల 31 లోపు అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలన్నారు. జెడ్పీ సీఈఓ భాస్కరరెడ్డి, నోడలాఫీసర్ శివారెడ్డి, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య ఇతర జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

నేడు ఇంటర్ ప్రవేశ పరీక్ష

లేపాక్షి: మహాత్మా జ్యోతిభా పూలే ఆంధ్రప్రదేశ్ వెనుకబడిన తరగతుల గురుకుల కళాశాలల్లో 2023–2024 విద్యా సంవత్సరానికి ఇంటర్ ప్రవేశ పరీక్ష ఆదివారం నిర్వహిస్తున్నట్లు జిల్లా గురుకుల పాఠశాలల కన్వీనర్ ప్రసాద్ తెలిపారు. లేపాక్షిలో 686, నసనకోటలో 436, గుడిబండ 320, టేకులోడు 322, గుండుమల 199 మంది చొప్పున మొత్తం 2,140 మంది విద్యార్థులు ప్రవేశ పరీక్ష రాయనున్నట్లు పేర్కొన్నారు. అభ్యర్థులు ఒక గంట ముందే పరీక్షా కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా ఎంపీసీ 240, బైపీసీ 160, ఎంఈసీ 80, సీఈసీ 160 మొత్తం 640 సీట్లు ఉన్నాయన్నారు.

ప్రసవాల సంఖ్య పెంచాలి


అంగన్‌వాడీ కేంద్రంలో సిబ్బందితో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ కృష్ణారెడ్డి

బత్తలపల్లి: జిల్లాలోని అన్ని ప్రభుత్వ వైద్యశాలలు, పీహెచ్‌సీల్లోనూ ప్రసవాల సంఖ్యను పెంచాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్వీ.కృష్ణారెడ్డి సూచించారు. శనివారం బత్తలపల్లిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంతో పాటు డీ.చెర్లోపల్లిలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, పత్యాపురం తండాలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన తనిఖీ చేశారు.

532 మంది విద్యార్థుల గైర్హాజరు

రాప్తాడురూరల్: ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షల్లో భాగంగా గురువారం జరిగిన గణితం–1బీ, జువాలజీ-1, హిస్టరీ-1, గణితం–2బీ, జువాలజీ-2, హిస్టరీ–2 పరీక్షలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 532 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రథమ సంవత్సరం పరీక్షకు 13,486 మంది విద్యార్థులకు గాను 13,090 మంది, మధ్యాహ్నం జరిగిన ద్వితీయ సంవత్సరం పరీక్షకు 4,324 మందికి గాను 4,188 మంది విద్యార్థులు హాజరయ్యారు.

దత్తతకు చిన్నారి

అనంతపురం సెంట్రల్: జిల్లా ఐసీడీఎస్ పరిధిలోని శిశుగృహలో ఆశ్రయం పొందుతున్న రెండేళ్ల చిన్నారిని దత్తత ఇచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. ఈ మేరకు ఇన్‌చార్జ్ పీడీ శ్రీదేవి శనివారం ఓ ప్రకటన విడుదల చేశారు. చిన్నారి ఆర్నాకు సంబంధించిన వారు ఎవరైనా ఉంటే వెంటనే ఐసీడీఎస్ కార్యాలయంలో సంప్రదించాలి. గడువు లోపు ఎవరూ ముందుకు రాకపోతే 30 రోజుల తర్వాత ప్రభుత్వ నిబంధల మేరకు చిన్నారిని దత్తత ఇవ్వనున్నారు.